

వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం తిమ్మారెడ్డిపల్లిలో రోడ్డు పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

# కాంగ్రెస్‌లో 'కాలె' మంటలు

- చేవెళ్ల నియోజకవర్గం అంతటా వ్యతిరేకిస్తున్న క్యాడర్
- శంకుస్థాపన, ప్రారంభాలు జరగకమందే ఆగ్రహ జ్వాలలు
- పోలీసుల ఎదుటే నవాబుపేటలో శిలాఫలకాల కూల్చివేత
- పనుల ప్రారంభోత్సవాలకు గంట ముందు గందరగోళం

నవాబుపేట, జూలై 3: బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను సొంత పార్టీ నేతలే అడుగడుగునా అడ్డుకుంటున్నారు. యాదయ్య కాంగ్రెస్‌లో చేరడాన్ని ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు మొదలుకొని.. మండలస్థాయి నాయకులు, కార్యకర్తల వరకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సంప్రదింపులతో యాదయ్య కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడంతో.. వారిద్దరి పై ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. తమకు తెలియకుండా పార్టీలోకి తీసుకొచ్చేంత పెద్దోళ్లు అయిండ్రా అంటూ మహేందర్‌రెడ్డి బాహటంగానే అన్నట్టు ప్రచారం జరుగుతున్నది. చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన భీంభరత్ వర్గం.. ఎమ్మెల్యే యాదయ్య నియోజకవర్గంలో ఎక్కడ పర్యటించినా నిరసన వ్యక్తం చేస్తూ అడ్డుకుంటున్నది. దీంతో యాదయ్య ఏమీ చేయలేక తలపట్టుకుంటున్నట్టు సమాచారం. బీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది ఆరు నెలల్లోనే పార్టీ మారడంపై జిల్లా అంతటా ఎమ్మెల్యే యాదయ్యపై విమర్శలు వస్తున్నాయి. బుధవారం నవాబుపేట మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, ఎస్సీ కమ్యూనిటీహాల్ శంకుస్థాపనకు ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యఅతిథిగా రావాల్సి ఉంది. అయితే.. యాదయ్య కాంగ్రెస్‌లో చేరడాన్ని వ్యతిరేకిస్తున్న తిమ్మారెడ్డిపల్లి, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు.. ఎస్సీ కమ్యూనిటీహాల్ శంకుస్థాపన, సీసీ రోడ్ల ప్రారంభానికి సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేసి నిరసన తెలిపారు. తిమ్మారెడ్డిపల్లిలో జరిగిన ఈ ఘటనలపై సంబంధిత డీఈ, ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఘటనపై విచారణ చేసి విధ్వంసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు పోలీసులు తెలిపారు.

## లోకం పోకడ




ఇది కూడా కేసీఆర్ తెచ్చిన తెలంగాణే గదా అని ఎక్కడ కనిపించినా కొట్టేస్తున్నా సార్!



ప్రజాభవన్‌లో ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, సీఎస్

# ముఖ్యమంత్రుల భేటీకి అన్ని ఏర్పాట్లు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, జూలై 3(నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ నెల 6న ప్రజాభవన్‌లో సమావేశం కానున్న నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజాభవన్‌లో సమావేశం కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని భట్టి అధికారులకు సూచించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రజావాణి ప్రత్యేక కార్యదర్శి దివ్య, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ప్రోటోకాల్ విభాగం డైరెక్టర్ వెంకటరావు తదితరులు డిప్యూటీ సీఎంకు ఏర్పాట్ల గురించి వివరించారు.

# ఏపీ నుంచి రావాల్సిన 3,392 కోట్లు ఇప్పించండి

**తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ**

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు ఉద్యోగుల పెన్షన్ ట్రస్టుకు ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో నుంచి రావాల్సిన రూ. 3,392కోట్ల బకాయిలను ఇప్పించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ నెల 6న జరగబోయే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి, పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు జేఏసీ నేతలు బుధవారం హైదరాబాద్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర విభజన సమయంలో పెన్షన్ ట్రస్టు నిధులు ఏపీకే వెళ్లాయని, ఇలా ఏపీ జెన్‌కో నుంచి రూ. 2,478 కోట్లు, ఏపీ ట్రాన్స్‌కో నుంచి రూ. 914 కోట్లు మొత్తంగా రూ. 3,392 కోట్లు తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కోకు రావాల్సి ఉందని వీటిని సత్వరమే ఇప్పించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి డిస్కమ్‌లకు రూ. 28, 842 కోట్లు, తెలంగాణ జెన్‌కోకు విద్యుత్తు కొనుగోలుకు సంబంధించిన రూ. 9,500కోట్లు రాష్ట్ర ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలని, రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని జెన్‌కో ద్వారానే నిర్మించాలని, సింగరేణి సంస్థకు కేటాయించొద్దని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీరెడ్డి, వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్, వేణు, ఏ వెంకటనారాయణరెడ్డి, పీ సదానందం, అబ్దుల్ తఖీ, కుమారస్వామి ఉన్నారు.

# ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నం

- త్వరలో రుణమాఫీని నిలబెట్టుకుంటాం
- రైతు భరోసాపై అసత్య ప్రచారాలు
- అర్హులందరికీ పెట్టుబడి సాయం
- మార్గదర్శకాల కోసమే ఉపసంఘం
- ప్రజాభిప్రాయాలు సేకరించి, అసెంబ్లీలో చర్చించాకే నిర్ణయం తీసుకుంటాం
- ఏపీ సీఎం చంద్రబాబు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురుశిష్యులు కారు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు మ్యానిఫెస్టోలో చెప్పినట్టుగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే రుణమాఫీ హామీని కూడా నిలబెట్టుకుంటామని విశ్వాసం వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో బుధవారం సాయంత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 500కే గ్యాస్ సిలిండర్ ఇప్పటికే అమలవుతున్నాయని చెప్పారు. రైతు రుణమాఫీపై కసరత్తు జరుగుతుందని చెప్పారు. రైతు భరోసా సాయం ఎగ్గొట్టడానికి ఏవేవో నిబంధనలను పెట్టబోతున్నట్టు మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని భట్టి స్పష్టం చేశారు. అర్హులైన రైతులకు రైతు భరోసా తప్పకుండా అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే మార్గదర్శకాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. లోతుగా అధ్యయనం చేసి ప్రజాభిప్రాయం సేకరించి అసెంబ్లీలో చర్చించి విధి విధానాలను రూపొందిస్తామని అన్నారు. చెట్లు, పుట్టలు, కొండలు, గుట్టలకు కూడా ఇవ్వాలని ప్రజలు చెబితే అలాగే ఇస్తామని చెప్పారు. పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించే ప్రతి పైసా దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

**ఆరు గ్యారెంటీల్లో కాంగ్రెస్ అమలు చేసినవి, చేయనవి**

| | |
|---|---|
| **గ్యారెంటీ 1- మహాలక్ష్మి** | |
| మహిళలకు ప్రతి నెల రూ.2,500 | అమలు కాలేదు |
| రూ.500కే గ్యాస్ సిలిండర్ | అమలు |
| ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం | అమలు |
| **గ్యారెంటీ 2- రైతు భరోసా** | |
| రైతులు, కౌలు రైతులకు రూ.15 వేల పెట్టుబడి సాయం | అమలు కాలేదు (ఈ సీజన్ నుంచి అమలు చేస్తామని ప్రకటన) |
| వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు | అమలు కాలేదు |
| వరి పంటకు రూ.500 బోనస్ | అమలు కాలేదు (ఈ సీజన్ నుంచి అమలు చేస్తామని ప్రకటన) |
| **గ్యారెంటీ 3- గృహజ్యోతి** | |
| 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు | అమలు |
| **గ్యారెంటీ 4- ఇందిరమ్మ ఇండ్లు** | |
| ఇల్లు లేనివారికి ఇంటి స్థలం, రూ.5 లక్షలు | అమలు కాలేదు |
| స్థలం ఉన్నవారికి నిర్మాణానికి రూ.5 లక్షలు | అమలు కాలేదు |
| ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం | అమలు కాలేదు |
| **గ్యారెంటీ 5- యువ వికాసం** | |
| విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు | అమలు కాలేదు |
| ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ | అమలు కాలేదు |
| **గ్యారెంటీ 6- చేయూత** | |
| పెన్షన్ రూ.4 వేలు | అమలు కాలేదు |
| ఆరోగ్యశ్రీ బీమా రూ.10 లక్షలకు పెంపు | అమలు |

**చంద్రబాబు, రేవంత్ సహచరులే..**

ఆంధ్రాలో ఎవరు సీఎంగా ఉన్నా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని భట్టి స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహచరులే తప్ప గురుశిష్యులు కాదని భట్టి గుర్తు చేశారు. తెలంగాణకు చెందిన ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో కలుపడానికి బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలే కారణమని ఆయన ఆరోపించారు. 7 మండలాలను ఆంధ్రలో విలీనం చేసినప్పుడు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీయే అధికారంలో ఉందన్న విషయాన్ని మరిచిపోయారా? అని భట్టి ప్రశ్నించారు. తెలంగాణ మండలాలను ఆంధ్రలో కలపడాన్ని బీఆర్‌ఎస్ అడ్డుకోలేదని విమర్శించారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు బీఆర్‌ఎస్ నాయకుడు హరీశ్‌రావు చెబుతున్న కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మరని అన్నారు. విభజన చట్టంలో ఏడు మండలాల విలీనం అంశం లేదని, అప్పటి బీఆర్‌ఎస్ సర్కార్ ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఆంధ్రకు అప్పజెప్పిందని విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ నాయకులు ఏడు మండలాల గురించి ఎందుకు మాట్లాడలేదని భట్టి ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లాలో రైతు ప్రభాకర్ ఆత్మహత్యకు కారణమైన వారిని వదలిపెట్టేది లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హెచ్చరించారు. దోషులు ఏ స్థాయిలో ఉన్నా విచారణ జరిపించి కఠినంగా శిక్షపడే విధంగా చూడాలని అధికారులను ఆదేశించినట్టు వివరించారు.

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 36.2°c | 22.5°c |
| మెదక్ | 35.5°c | 21.3°c |
| నిజామాబాద్ | 34.3°c | 24.0°c |
| మహబూబ్‌నగర్ | 34.1°c | 25.5°c |
| వరంగల్ | 34.0°c | 27.0°c |
| కరీంనగర్ | 34.0°c | 27.0°c |
| ఖమ్మం | 34.0°c | 25.0°c |
| నల్లగొండ | 34.0°c | 24.0°c |
| ఆదిలాబాద్ | 34.0°c | 23.8°c |
| హైదరాబాద్ | 31.7°c | 21.9°c |

# సమస్యల పరిష్కారానికి వేదికవ్వాలి

**రేవంత్, బాబు భేటీపై కూనంనేని వ్యాఖ్య**

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య సమావేశాన్ని స్వాగతిస్తున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం వేదిక కావాలని ఆకాంక్షించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భద్రాచలంలోని ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇచ్చేందుకు సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను అనుమతించాలని కోరారు.



# కాంగ్రెస్‌లో చేరిన కేకే

**ఖర్గే, రాహుల్ సమక్షంలో జాయిన్**

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ) : రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కేశవరావు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్‌లో చేరబోతున్నట్టు గతంలోనే కేకే ప్రకటించగా బుధవారం అధికారికంగా పార్టీలో చేరారు.

# 154 మంది వీఆర్‌ఏల అలాట్‌మెంట్

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ) : సాంకేతిక కారణాలతో ఇప్పటికీ వీఆర్‌ఏలుగా కొనసాగుతున్న 154 మందికి ప్రభుత్వం ఊరట కల్పించింది. విద్యార్హతల ఆధారంగా వారిని జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో వీరిని వివిధ విభాగాల్లోకి తీసుకున్నా, విద్యార్హతలకు సంబంధించిన సమస్యలతో అలాట్‌మెంట్ ప్రక్రియ పూర్తి కాలేదు.

# గుంపుమేస్త్రీ తడబడుతున్నారు

- ఏడు నెలలకు 'భరోసా'పై కమిటీనా ?
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్న

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): గుంపుమేస్త్రీనని చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డికి ఏడు నెలలైనా పాలనపై పట్టు రాలేదని, ఇంకా తడబడుతున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే రైతు భరోసా వేస్తామని చెప్పి, ఏడు నెలల తర్వాత ఇప్పుడు క్యాబినెట్ సబ్‌కమిటీ ఎందుకు వేశారని ప్రశ్నించారు. డిసెంబర్ 9న రైతు భరోసా ఏ ఒక్కరికి అందకున్నా ముక్కు నేలకు రా స్తా అని కొత్తగూడెం సభలో అన్నారని, ఇ ప్పుడు ఎక్కడ రాస్తారో చెప్పాలన్నారు. దున్నే ప్రతి రైతుకు, పండే ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్డీ లేని రుణం, 63 లక్షల మంది మహిళలకు 5 లక్షల బీమా అంటూ హామీలిచ్చి మోసం చేశారని దుయ్యబట్టారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌కు ముకుతాడు

> మొదటిపేజీ తరువాయి...

పెద్దలు ప్రకటించారు. వీటిపై పునఃసమీక్షిద్దామని రేవంత్‌రెడ్డి పట్టుబట్టినప్పటికీ, అవకాశం ఇవ్వకుండా, తొందరేముంది అంటూ.. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కర్ణాటకకు, కేసీ వేణుగోపాల్ కేరళకు వెళ్లిపోయారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి నిరాశతో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయినట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన పేర్లపై మంత్రులు, సీనియర్ నేతలు వ్యక్తపరిచిన అభ్యంతరాలతో పార్టీ పెద్దలు పూర్తిగా ఏకీభవించడమే వాయిదాకు కారణమని చెబుతున్నారు. బుధవారం ఉదయం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం రాజ్యసభ సభ్యుడు కే కేశవరావుతో కలిసి మల్లికార్జున్‌ఖర్గే ఇంటికి వెళ్లారు. కేశవరావు అధికారికంగా కాంగ్రెస్‌లో చేరిన ఈ కార్యక్రమంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా హాజరయ్యారు. అనంతరం వారంతా ఖర్గే ఇంట్లోనే సమావేశమై మంత్రివర్గ విస్తరణ, కొత్త పీసీసీ అధ్యక్షుని ఎంపికపై చర్చించినట్టు సమాచారం. అయితే మంత్రివర్గ విస్తరణకు రేవంత్‌రెడ్డి చేసిన ప్రతిపాదనతో పార్టీ పెద్దలు విభేదించినట్టు తెలిసింది. పార్టీలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని మళ్లీ కసరత్తు చేశాకనే మంత్రివర్గాన్ని విస్తరిద్దామని చెప్పి ప్రస్తుతానికి వాయిదా వేద్దామని ప్రకటించినట్టు తెలిసింది.

**రేవంత్ ప్రతిపాదనను ఎందుకు తిరస్కరించారు?**

మంత్రివర్గ విస్తరణ, పీసీసీకి కొత్త అధ్యక్షుని ఎంపికపై జూన్ చివరి వారంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దీపాదాస్ మున్షీతో విస్తృతంగా చర్చించారు. ఐదు రోజులపాటు వీరంతా ఢిల్లీలోనే ఉండిపోయిన విషయం తెలిసిందే. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం విడిగా కసరత్తు చేసినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలపై సీనియర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలు సహేతకంగా ఉన్నాయని అధిష్ఠానం భావించినట్టు సమాచారం. తమ అభిప్రాయాలను అధిష్ఠానం ముందే తీసుకోవడంతో విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే తరువాయి అన్న అంచనాతో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ముహూర్తం ఖరారు చేసుకొని అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి సమాచారం కూడా ఇచ్చారు.

**సీనియర్ల అభ్యంతరం ఏమిటి?**

మంత్రివర్గ విస్తరణపై తమతో చర్చించకుండానే సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా అధిష్ఠానం ముందు ప్రతిపాదన పెట్టారని సీనియర్ నేతలు, మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వారు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. మంత్రివర్గంలో ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం కల్పించలేదు. విస్తరణలో మొదట ఈ నాలుగు జిల్లాలకు అవకాశం కల్పించాలని సీనియర్లతోపాటు అధిష్ఠానం కూడా భావించినట్టు తెలిసింది. నల్లగొండ జిల్లా నుంచి ఇప్పటికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్నారు. అయినప్పటికీ ఇదే జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరును ప్రతిపాదించడాన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యతిరేకించినట్టు తెలిసింది. కోమటిరెడ్డి కుటుంబానికే రెండు మంత్రి పదవులు ఇచ్చే పక్షంలో తన భార్య పద్మావతికి కూడా ఇవ్వాలని పట్టుబట్టినట్టు తెలిసింది. అలాగే ఆదిలాబాద్ నుంచి సీనియర్ నాయకుడు ప్రేమ్‌సాగర్‌రావుకు కాకుండా రేవంత్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేరును ప్రతిపాదించడంపై కూడా అభ్యంతరాలు వ్యక్తమైనట్టు చెప్తున్నారు. దివంగత జీ వెంకటస్వామి కుమారులు వివేక్, వినోద్‌కు ఎమ్మెల్యేలుగా, ఆయన మనవడు వంశీకృష్ణకు పెద్దపల్లి ఎంపీగా అవకాశం కల్పించి మంత్రి పదవి కూడా వారి కుటుంబానికి ఇవ్వాలని రేవంత్‌రెడ్డి ప్రతిపాదించడాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలిసింది. తాను భట్టి వర్గీయుడనే కారణంగానే మంత్రి పదవి ఇవ్వకుండా సీఎం అడ్డు పడుతున్నట్టు ప్రేమ్‌సాగర్‌రావు తన సన్నిహితుల వద్ద వాపోయారు. ఈ విషయాన్ని కూడా సీనియర్లు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

**సీఎం పదవికి ఒప్పుకున్నామని. . . !**

*మరోవైపు హైదరాబాద్ నగరం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ లేకపోవడంతో మంత్రివర్గంలో స్థానం కల్పించలేదు. అయితే ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి శ్రీగణేశ్ గెలుపొందినప్పటికీ ఆయనకు కాకుండా ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయిన దానం నాగేందర్ పేరును సీఎం ప్రతిపాదించడాన్ని కూడా సీనియర్లు తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలిసింది. ఇలా ఉండగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా ఎలా ప్రకటిస్తారని కూడా సీనియర్లు అధిష్ఠానం వద్ద ప్రస్తావించినట్టు తెలిసింది. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి ఇస్తామంటే అంగీకరించామని, కానీ నిర్ణయాలు తీసుకొనే అన్ని అధికారాలు ఆయనకే అప్పగిస్తే ఊరుకొనేది లేదని స్పష్టం చేసినట్టు సమాచారం. దీనికితోడు మంత్రివర్గ విస్తరణతో పాటు మంత్రుల శాఖలు కూడా మారనున్నాయని మంత్రి దామోదర రాజనరసింహ బాంబు పేల్చారు. సీనియర్లకు డమ్మీ శాఖలు కట్టబెట్టి మొదటిసారి మంత్రి అయిన సీతక్కకు హోం శాఖ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారనే అభిప్రాయాన్ని ఆయన పరోక్షంగా వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణలో సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష, ఒంటెద్దు పోకడలకు చెక్ పెట్టే ఉద్దేశంతోనే అదిష్ఠానం దీనిని వాయిదా వేసినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం.*

# అర్చక ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

హైదరాబాద్, జూలై 3(నమస్తే తెలంగాణ): అర్చక ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో జరిగిన జేఏసీ అర్చక ఉద్యోగుల రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అర్చక ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి జూన్ 2, 2014 వరకు ఉన్న కటాఫ్ తేదీని తొలగించి 2017 వరకు ఉద్యోగాల్లో ఉన్న వారినందరినీ రెగ్యులరైజ్ చేయాలని, అర్చక ఉద్యోగుల కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని, వెల్ఫేర్ బోర్డు ద్వారా అర్చక ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని దేవాదాయశాఖ మంత్రి సురేఖ, ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావును కోరారు. సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, అర్చక సంఘం అధ్యక్షుడు బద్రీనాథాచార్యులు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖరశర్మ, గౌరవాధ్యక్షుడు కరుణాకర్ నాయుడు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శిగా లోకేశ్ కుమార్

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా లోకేశ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ముఖ్య కార్యదర్శిగా ఉన్న సందీప్‌కుమార్ సుల్తానియా ఇటీవల ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ కావడంతో ఎన్నికల కమిషన్ అదనపు సీఈవోగా బాధ్యతలు నిర్వస్తున్న లోకేశ్ కుమార్‌ను అదనంగా పీఆర్, ఆర్‌డీ కార్యదర్శిగా నియమించారు. లోకేశ్‌కుమార్ గతంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పనిచేశారు.

# రాష్ట్రంలో 'ఆర్థిక' ఎమర్జెన్సీ విధించాలి

**ఎమ్మెల్యే పాయల్ శంకర్**

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ విధించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడిచినా పాలన గాడిన పడలేదని విమర్శించారు. ఆరు నెలలుగా జీపీఎఫ్ నిధులు రాకపోవడంతో కనీసం మొక్కలు నాటే కార్యక్రమానికి కూడా డబ్బులు లేక జీపీలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే వాడుకుంటున్నదని ఆరోపించారు. గ్రామ పంచాయతీలపై సీఎం రేవంత్ సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ కోసం ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

# ప్రభుత్వ సలహాదారుడు పెంటారెడ్డి పదవీకాలం పొడగింపు



హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఎత్తిపోతల పథకాల సలహాదారుడిగా పెంటారెడ్డి పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో 6 నెలలు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెంటారెడ్డి పదవీకాలం మే15తో ముగిసింది. అసెంబ్లీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా ప్రసన్నకుమార్, ఇరిగేషన్‌శాఖ సలహాదారుడిగా ఆదిత్యనాథ్‌దాస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సలహాదారుగా శ్రీనివాసరాజును నియమించింది.

# మిషన్ భగీరథ కార్మికుల వేతనాలపై నివేదిక ఇవ్వండి

- ఇంటింటి సర్వే వివరాలు స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించండి
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి మిషన్ భగీరథపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ పథకం సిబ్బంది జీతాలు నెలల తరబడి పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయని భట్టి ప్రశ్నించారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా వేతనాలు ఉన్నాయని, రూ. 8 వేల నుంచి రూ. 13 వేల వరకు అందుతున్నట్టు తనకు సమాచారం ఉన్నదని పేర్కొన్నారు. పూర్తి వివరాలతో తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మిషన్ భగీరథ కార్మికులకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకంగా వేతనాలు ఉండేలా ఫిక్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై నిర్వహిస్తున్న సర్వే పూర్తికాగానే వివరాలను స్థానిక ఎమ్మెల్యేలకు అందజేయాలని సూచించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శి స్మితాసబర్వాల్, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీకి నిధులెట్ల?

- 6 గ్యారంటీలను ఎలా అమలు చేయాలి?
- దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆదాయాన్ని పెంచుకోవడంపై ఫోకస్
- ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయి బడ్జెట్

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వ్యవసాయ రుణాల మాఫీకి గడువు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో పడింది. రుణమాఫీతోపాటు 6 గ్యారంటీల అమలుకు కావాల్సిన నిధులను ఎలా సమీకరించాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి బడ్జెట్‌ను ఈ నెలాఖరులోగా ప్రవేశపెట్టాల్సి ఉండటంతో సంబంధిత అంచనాలను ఆర్థిక శాఖ సిద్ధం చేస్తున్నది. దీనిలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో శాఖల వారీగా సమీక్షలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు వ్యవసాయం, జౌళి, రెవెన్యూ తదితర శాఖలతో బడ్జెట్ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఉద్యోగుల జీతాలతోపాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం ఆదాయాన్ని పెంచుకునేందుకు కొత్త నిర్ణయాలను తీసుకునే అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలుస్తున్నది.

**రూ.28 వేల కోట్లకు చేరిన అప్పు**

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చినప్పటికీ నుంచి ఇప్పటివరకు రూ.28 వేల కోట్ల అప్పులు తెచ్చింది. ఈ నెలాఖరు నాటికి మొత్తం అప్పు రూ.31 వేల కోట్లకు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ రుణాల మాఫీ, రైతు భరోసా, 6 గ్యారంటీలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అవసరమైనన్ని నిధులను బడ్జెట్‌లో కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి కష్టమేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఇక స్పెషల్ ఆఫీసర్ల పాలన

- నేటి నుంచి మండల పరిషత్, రేపటి నుంచి జిల్లా పరిషత్‌లలో అమలు

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఇకపై మండలాలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో నడవనున్నాయి. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉండగా తాజాగా మండల పరిషత్‌లు కూడా వారి అజమాయిషీలోకి వచ్చాయి. ఎంపీపీల పదవీ కాలం బుధవారం ముగిసింది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో స్పెషల్ ఆఫీసర్లను నియమించకతప్పని పరిస్థితి ఉత్పన్నమైంది. స్పెషల్ ఆఫీసర్లుగా జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీవోలు, డిప్యూటీ డైరెక్టర్లను నియమించాలని ఆదేశాల్లో సూచించారు. స్పెషల్ ఆఫీసర్లు ఖచ్చితంగా ఎంపీడీవో కంటే కనీసం ఒక స్థాయి ఎక్కువ క్యాడర్ అధికారి ఉండే విధంగా చూడాలని పేర్కొన్నారు. వీరు ఎన్నికలు నిర్వహించే వరకు స్పెషల్ ఆఫీసర్లుగా కొనసాగనున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ల పదవీకాలం గురువారం ముగియనుంది. జడ్పీలకు జిల్లా కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమించనున్నారు. దీనికి సంబంధించి గురువారం ఆదేశాలు జారీ కానున్నాయి.

**వీటికి మినహాయింపు**

ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండల పరిషత్‌లు, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, మంగపేట, మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, నాగర్‌కర్నూల్ మండల పాలకవర్గాల పదవీ కాలం ఇంకా పూర్తి కాలేదు. ముగిశాక ఇక్కడ కూడా స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగనున్నది.